జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 22 | ఫిబ్రవరి | 2026 ◆ పేజీలు : 3



ప్రత్యేక ఇంటర్వ్యూ

# సమగ్ర ప్రణాళికతో.. కార్పొరేషన్ అభివృద్ధి

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో అత్యున్నత స్థాయికి తీసుకెళ్తాం
- అమృత్ 2.0 కింద రూ.124.48 కోట్లు కొత్తగూడెంకు.., పాల్వంచకు రూ.40 కోట్లు
- ఎండాకాలం నీటి సమస్యపై ముందస్తు కార్యాచరణ
- పారిశుద్ధ్యం నుంచి మౌలిక వసతుల వరకు సమగ్ర చర్యలు

**కొత్తగూడెం, ఫిబ్రవరి 21, ప్రజాజ్యోతి**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ను సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని కొత్తగా ఎన్నికైన మేయర్ గణేష్ తెలిపారు. ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో కార్పొరేషన్ ను అభివృద్ధి పరంగా అత్యున్నత స్థాయికి తీసుకెళ్తానన్నారు. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ పరిధిలోని అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే ఎమ్మెల్యే చొరవతో కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 పథకం కింద కొత్తగూడెంకు రూ.124.48 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ నిధులను తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతానికి వినియోగిస్తామని చెప్పారు. పాత పైపులైన్ల మార్పు, నీటి నిల్వ సామర్థ్య పెంపు, పంపింగ్ వ్యవస్థల ఆధునికీకరణ వంటి పనులు దశలవారీగా చేపడతామని వివరించారు. పాల్వంచ ప్రాంతానికి కూడా పథకం కింద రూ.40 కోట్ల నిధులు కేటాయించబడ్డాయని, అక్కడ తాగునీటి సమస్యల పరిష్కారం, అంతర్గత రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రస్తుతం రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడతామని మేయర్ స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు బోర్లు ఏర్పాటు చేయడం, లీకేజీలను గుర్తించి వెంటనే సరిచేయడం, సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించడం వంటి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనితో పాటు ప్రజల ఫిర్యాదులకు తక్షణ స్పందన అందేలా ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ అమలు చేస్తామని వెల్లడించారు. ప్రధానంగా పారిశుద్ధ్యాన్ని ప్రధాన అంశంగా తీసుకుంటున్నామని మేయర్ పేర్కొన్నారు. చెత్త సేకరణను క్రమబద్ధీకరించడం, వీధుల శుభ్రతను మెరుగుపరచడం, శ్మశాన వాటికల్లో హ్యాండ్ బోర్ల ఏర్పాటు, వీధి కుక్కల సమస్యపై చర్యలు చేపట్టడం వంటి అంశాలు అతని కార్యాచరణలో భాగమని తెలిపారు. రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ లోపాల సవరణ, పట్టణ మౌలిక వసతుల బలోపేతం కూడా ప్రణాళికలో ఉన్నాయని చెప్పారు. ఇప్పటివరకు కేవలం 20 డివిజన్‌లో మాత్రమే పర్యటించానని, ఇకపై ప్రతి రోజు ఒక డివిజన్ లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటానని ఆయన తెలిపారు. ప్రతి ప్రాంతానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. కార్పొరేషన్ అభివృద్ధి కోసం మంజూరైన నిధులను పారదర్శకంగా వినియోగించి కొత్తగూడెం కార్పొరేషన్ ను అభివృద్ధి పరంగా ముందంజలో నిలబెట్టడమే తన సంకల్పమని మేయర్ గణేష్ పేర్కొన్నారు. ప్రధానంగా ఇక్కడ సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రజల సహకారం కూడా అవసరమని ఆయన అన్నారు.




# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

- 293మంది లబ్ధిదారులకు గిరిజన సహకర సంస్థ క్రింద మంజూరు..
- ఎమ్మెల్యే కోరం కనకయ్య

**టేకులపల్లి,ఫిబ్రవరి21, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల ముత్యాలంపాడు క్రాస్ రోడు రైతు వేదిక నందు ఎంపీడీఓ ఆధ్వర్యంలోనిర్వహించిన గిరిజన సహకర సంస్థ ( ఐటీడీఏ )క్రింద మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళ పట్టాల పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే కోరం కనకయ్యహజరై 293 మంది లబ్ధిధారులకు పట్టాలు పంపిణి చేశారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ పెదవారి సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం,పేద ప్రజలందరికి ఉచిత విద్యుత్,ఫ్రి బస్, ఇందిరమ్మ ఇళ్ళు,రేషన్ కార్డులు,సన్న బియ్యం వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం.ఈ టేకులపల్లి మండలంలో ప్రజా రవాణాకు ఇబ్బంది కలుగకూడదు అనే ఉద్దేశంతో రాంపురం, కిష్టారం,మొక్కంపాడు తదితర గ్రామాలలో బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం

మిగతా 2 లో...

# జిల్లాలోని అంబులెన్స్ లను తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్

**పాల్వంచ, ఫిబ్రవరి 21,ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నడుస్తున్న 108 అంబులెన్స్లను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ శనివారం సమగ్ర తనిఖీ, ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు సమర్థవంతంగా, వేగవంతంగా అందుతున్నాయా లేదా అనే దానిపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీ సందర్భంగా వాహనాల

మిగతా 2 లో...



# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**పాల్వంచ, ఫిబ్రవరి 21,ప్రజా జ్యోతి**

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి గ్రామ పంచాయతీ సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేసే దిశగా సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్ అన్నారు, శనివారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇనిస్టూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పాత క్యాంపస్ నందు నిర్వహించిన రెండవ విడత నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని అశ్వరావుపేట, దమ్మపేట, దుమ్ముగూడెం, ములకలపల్లి, జూలూరుపాడు, టేకులపల్లి, ఇల్లందు, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన మొత్తం 233 మంది నూతన సర్పంచులకు ఈనెల 17 నుండి 21 వరకు శిక్షణ కార్యక్రమం



మిగతా 2 లో...

## ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలు పంపిణి




(మొదటి పేజీ తరువాయి...)
కాంగ్రెస్ ప్రభుత్వం చుట్టింది అని అన్నారు. గత ప్రభుత్వం,మాజీ ఎమ్మెల్యే ఈ ప్రాంతానికి ఎమి చేయలేదు, ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు, ఒక్క ఇళ్ళు కట్టించ లేదు. మరల ఏప్రిల్ నెలలో మంత్రి పొంగులేటి శ్రీనన్న నాయకత్వంలో మరల పెదలందరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తాం అని ఆయన తెలిపారు. ఈ టేకులపల్లి మండలంలో రొళ్ళపాడు,తడికలపుడి ప్రాంతాలను ప్రజా విహార ప్రాంతాలుగా మర్చేందుకు ప్రతి ఫాధనలు పంపాం. ప్రజలకు మంచి చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వానికి ప్రజలందరి ఆశీస్సులు ఉండాలి.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు,టేకులపల్లి మండల పార్టీ అధ్యక్షులు భుక్యా దేవా నాయక్,స్ధానిక సర్పంచ్ పూల్ బంతి రవి నాయక్,ఆత్మకమిటి చైర్మెన్ మంగి లాల్ నాయక్,పలు గ్రామాల సర్పంచులు, అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## జిల్లాలోని అంబులెన్స్ లను తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్



(మొదటి పేజీ తరువాయి...)
బయటి లోపలి పరిస్థితి, టైర్లు (స్టెప్నీ సహా), హెడ్‌లైట్లు, ఇండికేటర్లు, సైరన్ , పీఏ సిస్టమ్ పనితీరు, జీపీఎస్ వ్యవస్థ పని స్థితి, ఇంధన స్థాయి , లాగ్‌బుక్ నిర్వహణను పరిశీలించారు. అదేవిధంగా ఆర్సీ, ఇన్సూరెన్స్ , పొల్యూషన్ సర్టిఫికేట్ల చెల్లుబాటు స్థితిని ధృవీకరించారు. వైద్య పరికరాలలో ఆక్సిజన్ సిలిండర్ ప్రెషర్ స్థాయి, బీవీఎం (వయోజనులు, పిల్లల కోసం), సక్షన్ యంత్రం, బీపీ యంత్రం, స్టెతస్కోప్, గ్లూకోమీటర్, పల్స్ ఆక్సీమీటర్, స్ట్రెచర్, స్పైన్ బోర్డ్, సర్వైకల్ కాలర్లు, డెలివరీ కిట్ , ఇతర అత్యవసర పరికరాలను తనిఖీ చేశారు. అదే విధంగా ఔషధ కిట్ లో అడ్రినలిన్, అట్రోపిన్, డెక్స్ట్రోస్, ఐవీ ద్రావణాలు తదితర అత్యవసర మందుల లభ్యత , గడువు తేదీలను పరిశీలించారు. అంబులెన్స్‌ల శుభ్రత, లీనెన్ పరిస్థితి, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ విధానం, పీపీఈ కిట్లు , హ్యాండ్ శానిటైజర్ల లభ్యతను కూడా ధృవీకరించారు. ప్రజలకు అత్యవసర సేవలు ఎటువంటి లోపాలు లేకుండా అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు

# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

(మొదటి పేజీ తరువాయి...)
నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. సర్పంచులు పంచాయతీరాజ్ చట్టంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, గ్రామస్థాయిలో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు చట్టబద్ధమైన అధికారాలు , బాధ్యతలను సముచితంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ కార్యక్రమంలో గ్రామపంచాయతీల పరిపాలన విధానం, గ్రామాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన, బడ్జెట్ నిర్వహణ, ఆర్థిక పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం, సామాజిక బాధ్యత వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించబడినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, సామాజికాభివృద్ధి, పేదరిక నిర్మూలన తదితర సంక్షేమ కార్యక్రమాలు గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలవ్వా




లంటే సర్పంచులు నాయకత్వ లక్షణాలతో ముందుండాలని ఆయన అన్నారు. గ్రామాల్లో ప్రాథమిక సదుపాయాల కల్పన, శుద్ధి త్రాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, విద్యుత్ సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం కార్యాచరణలో పెట్టి, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సర్పంచులందరూ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న సర్పంచులకు ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు అందచేశారు . కార్యక్రమం ముగింపు సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు జిల్లా కలెక్టర్ ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సుధీర్, శిక్షణ డీపీఓ అనూష, డీఎల్పీఓలు ప్రభాకర్, రమణ, టీజీఐ ఆర్డీ సెంటర్ హెడ్ సుభాష్‌చంద్ర గౌడ్, ట్రైనర్లు బన్సింగ్, రవీందర్ రెడ్డి, సునీల్ కుమార్, ముత్యాలరావు, హాజ్ రత్ వలి, ఏపీవో రంగ, ఎస్ బీఎం రేవతి, డిటిఎం సందీప్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 16 ఐఈడిల నిర్వీర్యం, డంప్ స్వాధీనం

**చర్ల, ఫిబ్రవరి 21: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులపై నిర్వహిస్తున్న ప్రభావవంతమైన నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలలో భాగంగా శనివారం సి ఆర్ పీ ఎఫ్ 214 బెటాలియన్ క్యాంప్ కాండ్లపర్తి-2 ఫర్సగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నీలండగు గ్రామం వైపు శోధన ఆపరేషన్ నిర్వహించింది. ఈ ఆపరేషన్ సమయంలో బి /214 బెటాలియన్ యూనిట్ బి డి డి బృందం మందుపాతర తొలగింపు ఆపరేషన్ నిర్వహిస్తున్నప్పుడు మావోయిస్టులు అమర్చిన 16 బీర్ బాటిల్ ఐ ఈ డి లు ,ఐదు కిలోల ఒక ప్రెషర్ కుక్కర్







ఐ ఈ డి ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న అన్ని ఐ ఈ డి లను బి డి డి బృందం సూచించిన భద్రతా ప్రోటోకాల్‌ను అనుసరించి అక్కడికక్కడే సురక్షితంగా నిర్వీర్యం చేసింది. తదుపరి శోధన కార్యకలాపాలలో మావోయిస్టులు ప్లాస్టిక్ డ్రమ్‌లలో భూగర్భంలో దాచిన డంప్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.
**స్వాధీనం చేసుకున్న డంప్:** తాడు, సౌకర్యవంతమైన వైర్, మల్టీమీటర్, ఇనుప టంకం రాడ్, వైర్ కట్టర్, ఏం -సీల్ పెన్సిల్ బ్యాటరీ 1.5వి (ఏ ఏ ఏ ), డి సి మోటార్ మావోయిస్టు యూనిఫాం, మ్యాగజైన్ పౌచ్, మందులు మావోయిస్టు సాహిత్యం కరపత్రాలు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో తీవ్రమైన పెట్రోలింగ్ శోధన కార్యకలాపాలు నిరంతరం కొనసాగుతున్నాయి అని అధికారులు అన్నారు .

# వీరభద్ర స్వామి వారి ఆలయంలో పూజా కార్యక్రమం

**చర్ల, ఫిబ్రవరి 21: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని తేగడ లో శనివారం ఉదయం 6 గంటల నుండి భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి ఆలయంలో అంతర మండపంలో మహా గణపతికి పాల్గుణ మాస శుక్ల పక్ష చవితి సందర్భంగా గరిక తో గణపతి కి విశేష పూజ జరిగింది.తదుపరి భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి కి షమీ పూజ నిర్వహించారు .8 గంటల నుండి వీరేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం లఘున్యా స పూర్వకము .బిల్వ దళ మాలతో అష్టోత్తర ము అర్చన జరిగింది.తదుపరి ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు రుద్ర శాంతి హోమం నిర్వహించారు .మహా శివరాత్రి జరిగి 6 రోజులు పూర్తి అయిన సందర్భంగా శని వారం చవితి కావడం చేత వీరేశ్వర స్వామి కి రుద్రాభిషేకం బిల్వ దళములతో అష్టోత్తర పూజలు గిరిక పూజలుజరిగినవి.శ్రీమాన్.మామిడి.వెంకటేశ్వర రావు పోస్ట్ మ్యాన్ వారి ధర్మపత్ని.సుశీల కుమారుడు వెంకట సాయి రామ్ కోడలు మాధవి చర్ల. వాస్తవ్యులు మహాగణపతి పూజకి వీరేశ్వరాభి షేకం బిల్వ దళ అర్చనకోసం రుద్ర శాంతి హోమం కోసం తీర్థ ప్రసాద దాతా దంపతులు కూడా వీరే కావడం చేత వారికి మహా మండ



పంలో దశ శాంతి ఆశీస్సులు ఆలయ నిర్వాహకులు అయిన యల్లమందల.శ్రావణ్ కుమార్ ముందు ఆలయ అర్చకులు భాను ప్రకాష్ అందజేశారు.ఈ



కార్యక్రమం లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .

# మీసేవ సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొబైల్ యాప్‌పై జిల్లాస్థాయి శిక్షణ



**పాల్వంచ, ఫిబ్రవరి 21,ప్రజాజ్యోతి** జిల్లాలో మీసేవ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడమే లక్ష్యంగా ఐడీఓసి కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జిల్లాలోని నయాబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, జీపీవోలకు మీసేవ సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, మీసేవ కేంద్రాల్లో స్వీకరించే దరఖాస్తులను వేగవంతంగా, పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మీసేవ ఫీల్డ్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగం అత్యంత కీలకమని తెలిపారు. యాప్ ద్వారా క్షేత్రస్థాయిలోనే ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేసి తక్షణమే పోర్టల్‌కు అప్‌డేట్ చేయవచ్చని వివరించారు.క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా అధికారులు దరఖాస్తుదారుల నివాసానికి వెళ్లి సంబంధిత వివరాలను యాప్‌లో నమోదు చేయడం, జియో–ట్యాగ్‌తో కూడిన లైవ్ ఫోటోలను అప్‌లోడ్ చేయడం వల్ల నకిలీ దరఖాస్తులకు అవకాశం లేకుండా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. భౌతిక ఫైళ్ల కదలిక అవసరం లేకుండా పూర్తిగా డిజిటల్ విధానంలోనే పరిశీలన పూర్తయ్యే విధంగా వ్యవస్థ ఉండటంతో, ముఖ్యంగా కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ వంటి పథకాల దరఖాస్తులు త్వరితగతిన ఆమోదం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు . యాప్ ద్వారా సేకరించిన సమాచారం నేరుగా మీసేవ పోర్టల్‌కు అనుసంధానమై డేటా తక్షణమే అప్‌డేట్ అవుతుందని తెలిపారు.ఈ శిక్షణ తరగతులకు జిల్లాలోని సుమారు 160 మంది జీపీవోలు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, 40 మంది నయాబ్ తహసీల్దార్లు,15 మంది ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. యాప్ డౌన్‌లోడ్ విధానం, లాగిన్ ప్రక్రియ, ఫీల్డ్ వెరిఫికేషన్ నమోదు, ఫోటో అప్‌లోడ్, రిపోర్ట్ సమర్పణ తదితర అంశాలపై ప్రదర్శనతో కూడిన సమగ్ర అవగాహన కల్పించారు. అధికారుల సందేహాలకు వివరణాత్మక సమాధానాలు అందించి, యాప్ వినియోగాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.జిల్లాలో మీసేవ సేవలను సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు నాణ్యమైన సేవలను వేగవంతంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంజనాపురం ప్రాథమిక పాఠశాలకు రాష్ట్రస్థాయి స్వచ్ఛ విద్యాలయ అవార్డు

- జాతీయస్థాయి అవార్డుకు ప్రతిపాదన



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి ):**మండల పరిధిలోని అంజనాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రాష్ట్రస్థాయి స్వచ్ఛ విద్యాలయ అవార్డుకు ఎంపిక కావడంతో విద్యాశాఖ ఏఎంవో నాగరాజు శేఖర్, ఎంఈవో యదుసింహరాజులు ప్రత్యేకంగా చరవాణిలో హెచ్ఎం కిషన్ ను అభినందించారు. కేంద్రం ప్రారంభించిన స్వచ్ఛ ఎవమ్ హరిత్ విద్యాలయ రేటింగ్ (ఎస్హెచ్వీఆర్)లో భాగంగా పాఠశాలలో పచ్చదనం, పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, శౌచాలయాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ తదితర ఆరు ప్రధాన కొలమానాలపై 60 సూచికల ఆధారంగా రేటింగ్లు కేటాయించగా ఈ ప్రమాణాల్లో జిల్లా నుంచి అంజనాపురం ప్రాథమిక పాఠశాల ఒక్కటే ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి స్వచ్ఛ విద్యాలయ అవార్డుకు ఎంపికైంది. ఇదిలా ఉండగా రాష్ట్రం మొత్తంలో 2000 పాఠశాలలు ఈ అవార్డుకు పోటీపడగా 20 పాఠశాలల్లో ఈ పాఠశాల కూడా ఎంపికైందని, అంతేకాకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొత్తంలో అంజనాపురం ప్రాథమిక పాఠశాల ఒక్కటే ఎంపిక కావడం పట్ల విద్యాశాఖ పాఠశాల యాజమాన్యాన్ని ఇటీవల పాఠశాల పరిశీలనకు వచ్చిన సమయంలో ప్రత్యేకంగా అభినందించింది. అయితే జాతీయ స్థాయి పురస్కారానికి సైతం ఈ పాఠశాలను ప్రతిపాదించామని త్వరలోనే జాతీయ స్థాయి బృందం పాఠశాల పరిశీలనకు రానున్నట్లు హెచ్ఎం కిషన్ తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా ఈ పాఠశాల ఎంపికైతే జిల్లాకు మరింత గౌరవం దక్కుతుందని, పాఠశాల హెచ్ఎం కిషన్ తో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామస్థుల సమిష్టి కృషే ఇందుకు కారణం కావడం అభినందనీయమన్నారు.

# బెల్ట్ షాపులను తక్షణమే రద్దు చెయ్యాలి

- ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇర్ప రాజు దొర



**చర్ల, ఫిబ్రవరి 21: (ప్రజా జ్యోతి ):**చర్ల మండలంలో శనివారం బెల్ట్ షాపులను తక్షణమే తొలగించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇర్ప రాజు దొర డిమాండ్ చేశారు.ఈ సందర్భగా వారు మాట్లాడుతూ బెల్ట్ షాపులపై అధికారులు స్పందించకుంటే ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో చర్ల మండలం లో ఉన్న ఏజెన్సీ ఆదివాసీ గ్రామల్లో అన్ని బెల్ట్ షాపులు పై దాడులు నిర్వహిస్తామని మండలంలో మద్యం శాఖ అధికారులు, మద్యం వ్యాపారులు వారి మనషులతో ఏర్పాటు చేసుకున్న వందలాది బెల్ట్ షాపులను అరికట్టకుండ చూస్తున్న అధికారులను అనుమానించల్సి వస్తుందని అన్నారు. కనీస నిబంధనలు పాటించడం లేదని అడుగు అడుగునా ఎటు చుసిన బెల్ట్ షాపులు కనిపిస్తున్నాయని మద్యం షాపుల్లో అయితే ఏం ఆర్ పీ ధరలకే విక్రయించాల్సి వస్తుందనీ మద్యం వ్యాపారులే బెల్ట్ షాపుల్లో ప్రతి బాటిల్ కి 50 రూపాయలు అదనంగా పెంచి విక్రయించొచ్చని మద్యం షాపుల్లో లేని అన్ని రకాల బ్రాండ్స్, బెల్ట్ షాపుల్లో కి పంపించి మద్యం ప్రియులను విచ్చాలవిడిగా దోచుకుంటున్నారనీ అన్నారు .ఈ దోపిడీని అరికట్టాలనీ ఆదివాసీహక్కులపరిరక్షణవేదిక డిమాండ్ చేస్తుందన్నారు. బెల్ట్ షాపులు నియంత్రణ పై మద్యం శాఖ అధికారులు కనీసం దృష్టికూడా పెట్టడం లేదని అన్నారు. మద్యం వ్యాపారులకు బెల్ట్ షాపులకు ఉన్న లింకు ప్రజలకు అర్థం అవుతున్న అధికారులు మాములు మత్తులో ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారనీ అన్నారు .బెల్ట్ షాపులు రద్దు కోసం యువత తో అన్ని గ్రామాల్లో ఉద్యమం కార్యాచరణ ప్రణాళిక ప్రక్రియ ఏర్పాటు చేస్తాం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో ఆదివాసీ సంక్షేమపరిషత్ (ఏ ఎస్ పీ ) మండల అధ్యక్షులు కంగాల. అభిరామ్, ఇరప. రాంబాబు, కణితి. సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు సకాలంలో టీకాలు వేయించండి: సర్పంచ్ సమ్మయ్య



**పినపాక,ఫిబ్రవరి 21(ప్రజాజ్యోతి ):**పొట్లపల్లి గ్రామపంచాయతీ ప్రజలు పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని సర్పంచ్ సమ్మయ్య సూచించారు. పినపాక మండలం పోట్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన టీకా కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించి, అక్కడి సౌకర్యాలు మరియు వైద్య సేవలను వివరంగా తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైద్యుల సూచనల మేరకు పుట్టిన శి శువుల నుండి 18 సంవత్సరాల లోపు పిల్లల వరకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. టీకాలు పిల్లలను అనేక అంటురోగాల నుండి రక్షిస్తాయని, ప్రతి తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.గ్రామంలో టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.

# ఎస్ జీ ఎఫ్ ఆధ్వర్యంలో పుస్తకాల వితరణ



**పాల్వంచ, ఫిబ్రవరి 21; ప్రజా జ్యోతి:** ఇండియన్ స్కాట్ అండ్ గైడ్ ఫెలోషిప్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఉమెన్స్ గిల్డ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలను అందజేశారు. వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే , ఇతర విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను అందజేశారు , ఇండియన్ స్కాట్ అండ్ గైడ్ ఫెలోషిప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, సభ్యుడు చిరపంగి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఈ పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయం లో లైబ్రేరియన్ జి.మణి మృదుల కు అందజేశారు. గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, గ్రంథపాలకురాలు కృతజ్ఞతలు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- తాళ్లగొమ్మూరులో 15వేల మొక్కలు నాటిన రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్ర



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి ):**పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీరామ్ ప్రసాద్ అన్నారు. శనివారం సారపాక రోటరీక్లబ్ ఆఫ్ ఇన్ భద్ర ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మండల పరిధిలోని తాళ్లగొమ్మూరులో 15వేల మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమాన్ని ఐటీసీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ తో కలిసి ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోటరీక్లబ్ ఇన్ భద్ర నిర్వాహకులు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందని మొక్కలు నాటిస్తే స్వచ్ఛమైన గాలితో పాటు జీవరాశులకు మేలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, చాంద్పాషా, హెచ్ఆర్ హెడ్ శ్యామ్ కరణ్, భాస్కర్ రావు, ప్రపుల్లకుమార్, అడ్మిన్ మేనేజర్ చెంగల్రావు, బసప్ప రమేష్, రాజశేఖర్, సత్యనారాయణ, మురళీధర్, తిరుపతిరావు, మహేష్, రోటరాక్టర్లు విద్యావాణి, మల్లికార్జున్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటి పథకాలను సద్వినియోగం చేసుకోండి

- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యాకూబ్ పాషా

**పాల్వంచ, ఫిబ్రవరి 21,ప్రజా జ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2025–26 ఆర్థిక సంవ త్సరంలో మైనార్టీల కోసం రెండు ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టినట్లు మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యాకూబ్ పాషా శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారు టీజీఓబీఎంఎంఎస్ పోర్టల్ లో ఈనెల మార్చి 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న ముస్లిం, బౌద్ధులు, సిక్కులు, పార్శీలు, జైనులు స్వయం ఉపాధి పొందేందుకు గానూ ఈపథకా లను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ స్కూటర్ పథకం యూనిట్ విలువ రూ.1.50లక్షలని,సబ్సిడీ రూ.1.20 లక్షలు, అభ్యర్థి వాటా: రూ.30వేలు ఉంటుందన్నారు. అర్హతలు ఆధార్, ఫుడ్ సెక్యూరిటీ కార్డుతో పాటు వయసు 21 నుంచి 40 సంవత్సరాలు ఉండాలని ,పాన్కార్డు, ఆర్టీఏ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని, వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2లక్షల లోపు ఉండాలన్నారు.అదేవిధంగా తురకకాశి పథకం ,యూనిట్ విలువ రూ.60,000(రూ.10వేలు టూల్కిట్స్, రూ.50వేలు జనరేటర్). దీనికి అభ్యర్థి తురక కాశి ముస్లిం అయి ఉండాలని ఆధార్, ఫుడ్ సెక్యూరిటీ కార్డుతో పాటు వయసు 21 నుంచి 55 సంవత్సరాలు తప్పనిసరన్నారు. తురకకాశి ముస్లిం ధ్రువీకరణ పత్రం కమ్యూనిటీ అసోసియే షన్ వారు ధ్రువపరచినది అందించాలన్నారు. ఇతర సమాచారం కోసం 8520860785 కు సంప్రదించాలని సూచించారు.